క్లుప్తంగా

జగనన్న పాల వెల్లువతో ఆసరా



బి.కె.పల్లిలో జగనన్న పాలవెల్లువను ప్రారంభిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: బి.కె.పల్లిలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. మాజీ ఉప సర్పంచ్ పెట్ల రాంబాబు పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోరి సీఎం జగన్ అమూల్ డెయిరీతో ఒప్పందం చేశారన్నారు. అమూల్ కంపెనీ పాడి రైతులకు అధిక ధరను చెల్లిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెలిపాకలో జంగిల్ క్లియరెన్స్



మెలిపాకలో తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : మండలంలోని మెలిపాకలో రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన తుప్పల తొలగింపు పనులు శనివారం చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి దుర్గ, వార్డు సభ్యుడు గుల్ల అమర వెంకట సత్యనారాయణలు పర్యవేక్షించారు. రహదారికి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఈ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అలాగే అరబుపాలెంలో తుప్పలు పేరుకుపోవడంతో సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు శనివారం రహదారికి ఇరువైపులా గడ్డిమందు పిచికారీ చేయించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు



జిల్లేడు కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మునగపాక : ప్రకృతి వ్యవసాయం ద్వారా మేలు జరుగుతుందని గణపర్తి సర్పంచ్ చదరం నాయుడు అన్నారు. గణపర్తిలో శనివారం రైతులతో కలిసి 150 లీటర్ల జిల్లేడు కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ విధానం ద్వారా పంటల సాగు శ్రేయస్కరమన్నారు. అనకాపల్లి జిల్లా డీపీఎం లచ్చన్న ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దలు వెలగా దారనాయుడు, వెలగా జగ్గారావు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు తగ్గించాలి



కె.వెంకటాపురంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వెంకటరమణ

కోటవురట్ల: పెంచిన విద్యుత్ ఛార్జీలు, సర్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. కార్మికులు, ప్రజా సంఘాలను అణచివేసే ధోరణితో ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నెల 9వ తేదీ నుంచి వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయక కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సీపీఐ నాయకులు వి.అర్జునరావు, ఎస్.నాగేశ్వరరావు, జి.సూరిబాబు, టి.సత్తిబాబు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మళ్లీ జెండా ఎగరేద్దాం

- చేసిన మంచిని ఇంటింటా చాటి చెప్పండి
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్ల పాత్ర కీలకం
- గత పాలనకు, మన పాలనకు తేడాను ప్రజలకు వివరించండి
- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి(అనకాపల్లి రూరల్): గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పాలనలో ఉన్న తేడాను ప్రజలకు వివరించే బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గహసారథులు, వలంటీర్లపై ఉందని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని గురప్ప కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే శిక్షణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మరో ఆరు నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, అందరూ సమష్టిగా కార్యోన్ముఖులై మరోసారి సీఎంగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష, గడప గడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేశాడు కాబట్టే చంద్రబాబు జైలుకి వెళ్లాడని, కేసులో నిజం ఉంది కాబట్టే చంద్రబాబు రిమాండ్ పొడిగిస్తున్నారని అన్నారు. త్వరలో విశాఖ నగరం కార్యనిర్వాహక రాజధాని అవుతుందన్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి, టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి మంత్రి రోజాను ఉద్దేశించి అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడారని, టీడీపీ నాయకులు సంస్కార హీనులుగా మారుతున్నారని విమర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను నూరుశాతం అమలు చేసిన ఘనత దేశంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మునిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీపీ బోదెపు గోవింద్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు రాజాన మహాలక్ష్మి, కర్రి శివ, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వం సిఫార్సులు, కుల, మత, రాజకీయ భేదాలు చూసి పథకాలు ఇచ్చేదని, జగనన్న ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికమని వివరించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో వలంటీర్లు, గహసారథులు, సచివాలయ కన్వీలర్ల పాత్ర అత్యంత కీలకమన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారందరూ ఓట్లు వేసేలా వారికి ప్రభుత్వ పనితీరును వివరించాలన్నారు. ×ఆపు బాబూ నాటకం జగనే మా నమ్మకం× నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సుకుమారవర్మ కోరారు. ఈ వర్క్‌షాప్‌నకు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర అధ్యక్షత వహించారు. సమావేశంలో యలమంచిలి మండల పార్టీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మునిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు, దాసరి కుమార్, పిల్లా త్రినాథ్, వేల్పుల శేఖర్‌బాబు, పార్టీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీరోడ్లు, కాలువలు నిర్మించాలి



ప్రభుత్వం అందించిన పథకాలను తెలియజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి: తమ కాలనీలో సిమెంట్ రోడ్లు, కాలువలు లేక ఇబ్బంది పడుతున్నామని నక్కపల్లి రాజీవ్‌నగర్ కాలనీ వాసులు ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు తెలిపారు. శనివారం నక్కపల్లి సచివాలయం 3 పరిధిలో రాజీవ్‌నగర్‌కాలనీ, అప్పల పాయకరావుపేటలలో ఆయన గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగారు. కాలనీలో ఎన్ఆర్ఈజీఎస్ లేదా, వేరే గ్రాంటు మంజూరు చేసి రోడ్లు, కాలువలు నిర్మిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. అలాగే అప్పలపాయకరావుపేటలో ముస్లింలు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరగా వారికి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం వచ్చాక మండలంలో మూడు వేలమందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, వీరందరికి ఇళ్లు కేటాయించామని తెలిపారు. ఇంకా అర్హులుంటే మంజూరు చేస్తామన్నారు. ఈ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్న అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్ నేతల రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి , సింహాచలం దేవస్థానం బోర్డు సభ్యురాలు శేషారత్నం, వార్డు సభ్యులు బంగార్రాజు, అల్లాడ కొండ, నాయకులు ఎస్.గోవిందు, నీలేంద్రరావు, సన్యాసిరావు పాల్గొన్నారు.

పోషకాహార సరకుల పంపిణీ

ఎస్.రాయవరం: అంగన్‌వాడీలో ఇస్తున్న పోషకాహారాన్ని లబ్ధిదారులు విధిగా తీసుకోవాలని వమ్మవరం సర్పంచ్ పాలపర్తి పాపారావు కోరారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పలువురు లబ్ధిదారులకు పోషకాహార సరుకులు అందజేశారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు ప్రభుత్వం ప్రతి నెలా సకాలంలో నాణ్యమైన సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొంతిన సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శం జగనన్న సురక్ష

ఎమ్మెల్యే బాబూరావు



బంగారయ్యపేటలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు



వైద్యశిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : పేదల ఆరోగ్యానికి జగనన్న రక్షణ కల్పిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. శనివారం ఆయన బంగారయ్యపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సందర్శించారు. మందుల కౌంటర్లు, ఓపీ విభాగం , పరీక్షలు నిర్వహించే కౌంటర్లను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. మారుమూల ప్రాంతాల వారికి ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశానికి ఆదర్శంగా మారిందన్నారు. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యులు మురళీకృష్ణారెడ్డి, సుకన్యలతోపాటు, విశాఖ నుంచి వచ్చిన మరో ఇద్దరు నిపుణులు రోగులను పరీక్షించారు. సుమారు 480 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు అయినంపూడి చినపేర్రాజు, కె.రమణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేడ్కర్, ఏవో సీతారామరాజు, సొసైటీ అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష రోగులకు శ్రీరామరక్ష



సుంకపూరు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కాశీలక్ష్మి



వైద్య శిబిరాన్ని సందర్శించిన స్పెషల్ ఆఫీసర్ లచ్చన్న



పెదకలవలాపల్లిలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



తిమ్మరాజుపేటలోని స్టాల్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



యలమంచిలిలో రోగులకు మందుల కిట్ బ్యాగులు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి విశేష స్పందన వచ్చింది. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రమణమూర్తిరాజు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఉప సర్పంచ్ జగన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, మాజీ సర్పంచ్ జగన్నాథరావు,ఎంపీటీసీ అప్పలనరసమ్మ, ఎంపీడీవో మన్మథరావు, చూచుకొండ వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, వినోద్‌కుమార్ వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంటకాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రాంబిల్లి: పెదకలవలాపల్లిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సందర్శించారు. జగనన్న పాలనలో పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులను నియమించడంతో పాటు పుష్కలంగా మందులు అందుబాటులో ఉంటున్నాయన్నారు. సుకుమారవర్మ, జెడ్పీటీసీ ధూళి నాగరాజు, ఎంపీపీ జి. శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్,సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, ఎంపీడీవో కొండలరావు, తహసీల్దార్ భాగ్యవతి పాల్గొన్నారు.

అనుభవజ్ఞులైన వైద్యులను నియమించాలి

యలమంచిలి : మండలంలో పురుషోత్తపురం,యలమంచిలి పట్టణంలో తులసీనగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎమ్మెల్యే రమణమూర్తిరాజు శనివారం సందర్శించారు. వైద్య శిబిరాల్లో అనుభజ్ఞులైన వైద్యబృందాన్ని ఏర్పాటు చేయాలని, పూర్తి స్థాయిలో మందులు శిబిరాల్లో అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వోను ఫోన్‌లో కోరారు. రోగులకు జగనన్న ఆరోగ్య సురక్ష మందులు కిట్ సంచులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ గోవింద్, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి, వైస్ ఎంపీపీ రాజాన శేషు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు అర్రెపు గుప్తా, రాజాన సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులు యర్రయ్యదొర, త్రినాథ్, సేనాపతి రాము, ఎంపీడీవో అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు పాల్గొన్నారు.

కోటవురట్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్ష అని సర్పంచ్ చిటికెల కాశీలక్ష్మి అన్నారు. సుంకపూరు ఎంపీపీ స్కూల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి రోగులకు ఓపీ చీటీలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్న ప్రతి కుటుంబం ఆరోగ్యంతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. ఓ పక్క సంక్షేమ పథకాలను అందిస్తూనే విద్య, వైద్య పరంగా వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు విశేష స్పందన వస్తోందన్నారు. ఈ శిబిరాల్లో 7 రకాల వైద్య పరీక్షలతో పాటు 14 రకాల వైద్య సేవలు అందుతున్నాయన్నారు. స్థానికంగా ఉన్న వైద్యులే కాకుండా కేజీహెచ్, అపోలో వంటి ఆస్పత్రుల నుంచి కూడా ప్రత్యేక వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సంతోష్‌కుమార్, సుదీప్, అనూష, ప్రత్యేక వైద్య నిపుణులు, ఎంపీహెచ్‌ఈవో గోవిందరావు, వైస్సార్‌సీపీ నాయకులు చిటికెల రమణ, ఎస్.వి.రమణమూర్తి, వైద్య, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

450 మందికి ఉచిత వైద్య పరీక్షలు

పాయకరావుపేట : మండలంలో పెదరాంభద్రపురం, కొత్తూరు గ్రామాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో గ్రామంలో సుమారు 450 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. డాక్టర్ అనుతేజ్ వెన్నెముక వ్యాధి సమస్యలు, డాక్టర్ ఎం.మాధురి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగవరం గ్రామ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జి.స్వరాజ్యం సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి, రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో కీళ్ల నొప్పులు, దగ్గు, బీపీ, షుగర్ వ్యాధులను పరిశీలించి పరీక్షలు చేశారు. మండల ప్రత్యేక అధికారి సిహెచ్.లచ్చన్న వైద్య శిబిరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.సౌజన్య ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలను స్టాళ్ల ఏర్పాటు చేసి ప్రదర్శించారు.

కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ సూరిబాబు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రామకృష్ణ, గ్రామ సర్పంచ్ మార్తమ్మ, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, కొత్తూరు సర్పంచ్ రెడ్డి సీత, ఉప సర్పంచ్ రాజుబాబు, ఈవోఆర్డీ చంద్రశేఖర్, పార్టీ నాయకులు సత్యనారాయణ, త్రిపర్న శ్రీను పాల్గొన్నారు.

వచ్చే నెలలో సాంస్కృతిక సమ్మేళనం



శ్రీకృష్ణ ఆలయంలో సమావేశమైన ఫౌండేషన్ సభ్యులు

అచ్యుతాపురం (అనకాపల్లి): వచ్చే నెలలో హిందూ ధర్మం, కళలను ప్రదర్శించే వారందరినీ ఒక చోటకి చేర్చి సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తామని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు తెలిపారు. అచ్యుతాపురం మండలంలోని శ్రీకృష్ణ, ఆంజనేయ స్వామి దేవాయలంలో శనివారం నిర్వహించిన సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాంస్కృతిక సమ్మేళనంలో కళాకారులను సత్కరించుకుందామని తెలిపారు. ఈనెల 14న సత్సంగం, 20న సరస్వతీ పూజ, 23న విజయదశమి నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. పౌర్ణమి రోజున సామూహిక హారతి నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ మండల కన్వీనర్ గుడివాడ రమణ, కో-కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు, ఆడారి త్రినాథ్, చోడపల్లి సత్యం, కూండ్రపు రమణ, బంటు రాము, మేరుగు రాజారావు పాల్గొన్నారు.

దోసూరులో 384 మందికి వైద్య పరీక్షలు



దోసూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

అచ్యుతాపురం(అనకాపల్లి): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు కోరారు. దోసూరులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. శిబిరంలో 384 మంది స్థానికులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న 10 మందిని వైద్యులు ఉన్నతాసుపత్రులకు సిఫారసు చేశారు. సుకుమారవర్మ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ నర్మాల కుమార్, దేశంశెట్టి శంకర్‌రావు, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు,మెడికల్ ఆఫీసర్ అలేఖ్య పాల్గొన్నారు.

తెలుగు పద్యాలు నేర్చుకోండి



సదస్సులో మాట్లాడుతున్న కె.రామమోహన్‌రావు

అచ్యుతాపురం(అనకాపల్లి): తెలుగు భాష నిర్లక్ష్యానికి గురి కాకుండా అందరూ తెలుగుని ప్రోత్సాహించాలని అనకాపల్లి జిల్లా తెలుగు పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రామమోహన్‌రావు కోరారు. అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ,కొండకర్లలో శనివారం తెలుగుకు వెలుగు నిద్దాం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహన్‌రావు మాట్లాడుతూ తెలుగు చదవడం, రాయడం , మంచి పుస్తకాలు చదవడం వంటి అలవాట్లను అలవర్చుకోవాలని సూచించారు. విశ్రాంత ఎంఈవో శిష్టా తమ్మిరాజు మాట్లాడుతూ శతక పద్యాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, పద్యాలు చదవాలని కోరారు. కథా రచయిత రంగబాబు మాట్లాడుతూ చిన్న చిన్న కథలను చదవాలన్నారు. కార్యక్రమంలో హరిపాలెం హెచ్ఎం రవి, కొండకర్ల హెచ్ఎం సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి



దుకాణదారులతో మాట్లాడుతున్న అచ్యుతాపురం పోలీసులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని అన్ని వ్యాపార సంస్థల సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ మురళీరావు సూచించారు. శనివారం మండలంలోని వ్యాపారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి కనిపించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అనుమానితుల కదలికలను గుర్తించి పోలీసులకు తెలపాలని కోరారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రాత్రి పది గంటల లోపే దుకాణాలను మూసి వేయాలని, బంగారు దుకాణాలు,షాపింగ్ మాల్స్ వద్ద సెక్యూరిటీ గార్డ్స్‌ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లాడ్జిలను తనిఖీ చేశారు. ఎస్ఐ సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



మునగపాకలో వినాయక విగ్రహాన్ని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నందీశ్వర తులసీ కళావేదిక ఆవరణలో డేంజర్‌గాయ్స్ ఆధ్వర్యంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు వినాయక విగ్రహాన్ని దర్శించుకొని పూజలు చేశారు.

అథ్లెటిక్స్‌కి నలుగురు విద్యార్థినుల ఎంపిక



రన్నింగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పీడీ శ్రీనివాస్



హైజంప్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థినులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మండలం నుంచి నలుగురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్టు పీడీలు శ్రీనివాసరావు, నిర్మల తెలిపారు. శుక్రవారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన పోటీల్లో అండర్ 17 విభాగంలో ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు 1500 మీటర్ల పరుగు పందెంలో టి.ఎన్.వి.దుర్గ, 3000 మీటర్ల పరుగు పందెంలో కె.కావ్య ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. వీరివురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్ 17లో ప్రగడ మాధురి హైజంప్‌లో ప్రథమ స్థానం, అండర్ 14 విభాగంలో రాయవరపు కీర్తి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పీడీ నిర్మల తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఏపీటీఎఫ్ ఎన్నికలు ఏకగ్రీవం



మాట్లాడుతున్న ఎస్.వి.సూర్యనారాయణ

రాంబిల్లి : ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. వెంకటాపురంలో శనివారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.వి.ఎస్.ఎన్.రాజు (కిరణ్), ప్రధాన కార్యదర్శిగా కె.అప్పాజీ, గౌరవ అధ్యక్షులుగా కె. శ్రీనివాసరావు ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా వై. శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కొత్త కార్యవర్గం కృషి చేయాలని కోరారు.

అరట్లకోట విద్యార్థికి డాక్టరేట్



ఏయూ వీసీ నుంచి పట్టా అందుకుంటున్న బొడ్డపాటి రాజు

పాయకరావుపేట : అరట్లకోట గ్రామానికి చెందిన పరిశోధక విద్యార్థి బొడ్డపాటి రాజుకి ఆంధ్ర యూనివర్సిటీ విద్యా విభాగంలో డాక్టరేట్ లభించింది. విభాగ అధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో 'ఎ స్టడీ ఆన్ క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇన్ సెకండరీ స్కూల్స్' అనే అంశం మీద పరిశోధన చేసినందుకు రాజుకు ఆంధ్ర యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి శనివారం తన ఛాంబర్‌లో రాజుకు డాక్టరేట్ పట్టాను అందజేశారు. డాక్టరేట్ పొందిన రాజుకు షారోన్ రాజు, విభాగం ఆచార్యులు అభినందనలు తెలిపారు.